చెయ్యని పాపాలే మనుష్యుల్ని వెంటాడే ఈ రోజుల్లో చేసిన పాపాలు చెప్పేవరకూ బయలుపడవనుకోవడం అర్థంలేని మాట. ఫలానావాడు దొంగ అని అనుమానింపబడి, తీర్మానింపబడి, వాడికి తన్నులు తగలడమే వాడు పాపి అనీ, శిక్షార్హుడనీ ధృవపరుస్తుంది. ముందుగా ఈ శిక్షాకాండ అంతా జరుగుతుంది. ఆ తర్వాత, శిక్షించే వారి మానసికతృప్తికోసమై ఫలానావాడిని న్యాయంగానే శిక్షించాం అనే నైతిక ధీమాకోసమై, శిక్షాపాత్రుని నోటివెంటనే 'నేను పాపినే' అని అనిపించడం-కొన్నికొన్ని సందర్భాలలో నిజంగా పాపి కాకపోయినా, లాఠీ దెబ్బలకు జడిసైనా 'నేనే పాపిని' అని అనవలసి రావడంకూడా అప్పుడప్పుడు జరుగుతూనే వుంటుంది. వెరశి: చేసిన పాపం చెప్పకముందే దేహశుద్ధితో పటాపంచలై పోతుంది. ఇంక వేరే చెప్పడంకూడా ఎందుకయ్యా అంటే చెప్పించే ప్రభువుల ఆత్మతృప్తికోసమై!

---

## కెరడుగట్టిపోయిన మనిషి

'రామ్మోహన్రావుకోసం వచ్చారా? ఇంట్లో లేడు. హోటలుకు వెళ్ళాడు భోజనానికి. కూర్చుంటే కూర్చోండి అతడు వచ్చేదాకా.'

'అలాగేలెండి, కూర్చుంటా-మీరూ అతనూ కలిసి ఈ ఇంట్లో వుంటున్నారా?'

'అన్నమాటేనండి, మీరుకూడా రామ్మోహన్రావు పనిచేసే కంపెనీలోనే పని చేస్తున్నారా?'

'అవునండి. అతడితో కొంచం పనివుండి వచ్చా.'

'కూర్చోండి— వస్తాడు. మీ పేరు?'

'కృష్ణమూర్తి—'

'అలాగా? నీరసంగా కనిపిస్తారేం?'

'వంట్లో ఆట్టే బాగులేదండి.'

'దానికి— ఏదైనా పుచ్చుకోలేక పోయారా?'

'............'

'గడ్డం అంతగా మాయబెట్టుకున్నారేం? నిజానికి నా గడ్డంకూడా మాసే వుందనుకోండి-'

'పని తీరిక కనపడదండీ గడ్డం, గీసుకుందుకూ.'

'మీరే గీసుకుంటారా గడ్డం - చాతనవునా?'

'ఇదేం బ్రహ్మవిద్యటండీ?'

'నామట్టుకు ఇది బ్రహ్మవిద్యే-ఎన్నిసార్లో ప్రయత్నించాను. స్వంతంగా చేసుకుందామని- ప్రతిప్రయత్నంలోనూ రక్తం కళ్లచూశాను.'

'కొంచం జాగ్రత్తగా ప్రయత్నిస్తే అది సులభంగా చాతనవుతుంది'

'మీరు ఎన్నిసార్లు ప్రయత్నించి విజయం పొందారు.'

'నా తొలిప్రయత్నంలోనే విజయం పొందాను'

'ఎంత అదృష్టం!'

'పని తీరిక లేకపోబట్టిగాని లేకపోతే ఇందాకా పెరగ నిచ్చేవాణ్ని గాను ఈ గడ్డాన్ని.'

'మీరు పనితీరికలేక గీసుకో లేదు. మంగలివాడు రాకపోవడం మూలాన నేను ఇలా అట్టే బెట్టుకున్నాను. ఊళ్ళోకివెళ్లి ఏ సెలూన్‌కేనా వెడదామంటే బద్ధకం-ఈవేళ సాయంత్రంగానీ వెళ్ళాలి.'

'మీ కేమిటి పని?'

'కవినండి. చూట్టంలేదూ నాబద్ధకం?'

'అదృష్టవంతులు! నాబోటివాళ్లకు అలా సాగుతుందా?'

'అయితే మీరు గడ్డం బాగా గీసుకోగలరన్న మాటే-?'

'ఓ ఫస్టుగా!'

'నాదగ్గరకూడా ఆయుధాలున్నాయి కాని మళ్ళీ ప్రయత్నిస్తే పెచ్చులు లేచివస్తాయని భయం......'

'జాగ్రత్తగా ప్రయత్నించి చూడండి-ఫరవాలేదు—'

'ప్రయత్నించనండి-గుండెలు కొట్టుకుంటున్నాయి, వెనకటి ప్రజు ల్నాలమాట తలుచుకుంటూంటే—'

'అయితే మీ గడ్డం ఇతరులు గీయవలసిందే!'

'అంతేనండి- అలా రాసిపెట్టేక తప్పతుందా?'

'అదే నయం లెండి!'

'ఏం నయం లెద్దురూ! మంగలాడికోసం పడిగాపులడి కూర్చోవాలి- లేకపోతే సుఖంగా నిద్రపోతూ వుండవలసిన ఈ పగలు పదిగంటలవేళ బద్ధకాన్ని చంపుకుని మంగలిషాపుకు బయలుదేరిపోవాలి.'

'ఫరవాలేదు లెండి-పావుగంటపని-వెళ్ళి చేయించేసుకురండి-'

'వెళ్లనండీ-బద్ధకంగా వుంది.'

'అయితే మా నెయ్యండి.'

'అయితే మీరు గడ్డం బాగా గీసుకోగలరన్న మాట?'

'ఓ ఫస్టుగా!'

'అయితే నాకు కాస్త గీసిపెడుదురూ, మళ్ళీ వీధిలోకి వెళ్లలేను...'

'నన్నా గీయమంటూంట......?'

'మిమ్మల్నే భాయీ...మనలో మనకి...'

'నే నెవర్నో మీరు ఎరగరు...?'

'ఎరక్కపోవడమేం ఖర్మం? రామ్మోహన్రావు పనిచేసే కంపెనిలోనే మీరూ పనిచేస్తున్నారు...మీజీతం పాతికా, ముప్ఫయ్యా?'

'మీరు పొరబాటుపడుతున్నారు-నేను ఆ కంపెనీ మేనేజర్ను-'

'అలాగా! అయితే ఇంకనేం? మీరు ఆఫీసుకి ఎప్పుడు వెళ్ళినా అడిగేవాళ్ళే ఉండరు. కూర్చోండి-కాస్త గీసేసి వెడుదురుగాని!'

---